క్లుప్తంగా

ఐకేపీ కార్యాలయం సందర్శన

ములకలపల్లి: విరివిగా మొక్కలు పెంచాలని అడిషనల్ పీడీ రవి అధికారులకు సూచించారు. స్థానిక ఐకేపీ కార్యాలయాన్ని సోమవారం ఆయన అకస్మికంగా సందర్శించారు. కేంద్ర కమిటీ నేడు ములకలపల్లి పర్యటనకు రానున్నారని, తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంపీఓ లక్ష్మయ్య, ఏకేపీ ఏపీఎం సంపత్‌కుమార్, ఈజీఎస్ ఏపీఓ హుస్సేన్, జీపీ కార్యదర్శి రవి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ కోత

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నేడు(మంగళవారం) విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు స్థానిక ట్రాన్స్‌కో ఏడీఈ బి.వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనతో తెలిపారు. అశ్వారావుపేట 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పేరాయిగూడెం, హెర్బెక్స్ ఫీడర్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం

కరకగూడెం: మాదక ద్రవ్యాల నిర్మూలనే తమ ప్రధాన లక్ష్యమని కరకగూడెం ఎస్సై రాజేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం మండల కేంద్రంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై వాల్ పోస్టర్లు ఆవిష్కరించి ప్రజలకు అవగాహన కల్పించారు. అవగాహనా సదస్సులో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: యువత గంజాయికి బానిసకావద్దని ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో అవగాహన సదస్సు నిర్వహించగా దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలను రవాణా చేస్తునట్లు గానీ, విక్రయిస్తునట్లు గానీ, సేవిస్తునట్లు గానీ సమాచారం తెలిస్తే వెంటనే 8712682004, 8712682105, 8712682109 నంబర్లతో పోలీస్ వారికి సమాచారం అందించాలని కోరారు.

పోలీసుల కృషి అభినందనీయం

మణుగూరురూరల్: గంజాయి నియంత్రణలో మణుగూరు సబ్ డివిజన్ పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని మాస్‌లైన డివిజన్ కార్యదర్శి ఆర్.మధుసూధన్‌రెడ్డి సోమవారం సోషల్‌మీడియా వేదికగా అన్నారు.

మారుతీశర్మకు అవార్డు

దమ్మపేట: జోతిష్య రంగంలో విశేష సేవలు అందించినందుకు గాను, దమ్మపేట గ్రామానికి చెందిన కామవరపు విజయమారుతి శర్మను సూర్యనందిని అవార్డుతో సత్కరించారు. సోమవారం హైదరాబాద్‌లో సూర్యచంద్ర కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవార్డు ప్రదానం చేశారు.

తల్లిపాల వారోత్సవాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక సెక్టార్ పరిధిలోగల వినాయకపురం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరాజ్యం పలు సూచనలు చేశారు. అనంతరం గృహ సందర్శన చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీచర్లు డి.సుజాత, జె.వరలక్ష్మి, ఎస్.సుజాత, పి.శకుంతల, డి.ముత్తమ్మ, కె.వెంకట రమణ, బి.లక్ష్మి, ఏఎన్ఎం కే సావిత్రి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

చర్లరూరల్: చర్ల మండలంలోని సత్యనారాయణపురం, పీహెచ్‌సీ పరిధిలోని ఎర్రబోరు గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 38 మందికి వైద్యాధికారిని దివ్యనయన వైద్య పరీక్షలు చేసి వారికి కావలసిన మందులను పంపిణీ చేశారు. హెచ్ఈఓ బాబూరావు, హెల్త్ అసిస్టెట్లు వరప్రసాద్, వేణు, కవిత, ఆశా కార్యకర్త భూలక్ష్మి పాల్గొన్నారు.

కరకగూడెం: మండల కేంద్రంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి కారం మధు ఆధ్వర్యంలో సుమారు 69మంది గ్రామస్తులను పరీక్షించి మందులను అందజేశారు. అనంతరం గ్రామంలో విస్తృతంగా పర్యటించి ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. మరోవైపు మండలంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అధికారులను మండల స్పెషల్ ఆఫీసర్ దినేష్ కుమార్ ఆదేశించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కుమార్, హెచ్ఈఓ కృష్ణయ్య ఏఎన్ఎం రుక్మిణి, ఆశలు పాల్గొన్నారు.

ఆ ఆలోచన సరికాదు..

ములకలపల్లి: తెలుగు విశ్వ విద్యాలయాన్ని పొట్టి శ్రీరాములు పేరుతోనే కొనసాగించాలని ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు అత్యంరాంబాబు కోరారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ గుడ్ల పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాన కార్యదర్శి అద్దంకి రమేశ్, కోశాధికారి ఓబులసెట్టి ప్రభాకర్, ములకలపల్లి పట్టణ అధ్యక్షుడు పద్దం నర్సింహారావ తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు చేయాలని ఆలోచన చేయడం సరికాదని ఆర్యవైశ్య సంఘం నాయకులు ఖండించారు. సోమవారం మండల కేంద్రంలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వనమా గాంధీ, దోసపాటి శంకరరావు, ఉమ, వనమా శ్రీనివాసరావు తదితరుతులు పాల్గొన్నారు.

స్వ(ప)చ్ఛదనం ఆరంభం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమం సోమవారం మండలాల్లో ప్రారంభమైంది. ఇందులో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించి మొక్కలు నాటారు. శ్రమదానం చేసి పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. వారు మాట్లాడుతూ.. నాటిన ప్రతిమొక్కనూ సంరక్షించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్


అశ్వారావుపేటరూరల్: చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది


గుండాల: మర్కోడులో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఈఓ చంద్రశేఖర్



భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు


మణుగూరురూరల్: చెత్తాచెదారాన్ని శుభ్రం చేస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది


కరకగూడెం: వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


అన్నపురెడ్డిపల్లి: విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్



చర్లరూరల్: స్వచ్ఛదనం-పచ్చదనం ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ, తదితరులు


దుమ్ముగూడెం: పర్ణశాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుభ్రం చేస్తున్న అధికారులు


ములకలపల్లి: జెడ్పీ స్కూల్ ఆవరణలో మొక్క నాటుతున్న ఎంపీఓ లక్ష్మయ్య


బూర్గంపాడు: విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న తహసీల్దార్ ముజాహిద్


దమ్మపేట జెడ్పీహెచ్ఎస్ ఆవరణను పరిశుభ్రం చేస్తున్న ఎంపీడీఓ, నాయకులు


చంద్రుగొండ: జూలూరుపాడు రోడ్డులో మురికి కాలువలను శుభ్రం చేయిస్తున్న అధికారులు


భద్రాచలంటౌన్: మొక్కలు నాటుతున్న కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

డ్రమ్ సీడర్‌తో నీటి ఆదా

దమ్మపేట: సాధారణంగా పద్ధతిలో వరి సాగు చేయు విధానం కంటే, డ్రమ్ సీడర్ పద్ధతి ద్వారా 25 శాతం నీటిని ఆదా చేయవచ్చని సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని లింగాలపల్లి గ్రామంలో చాప ఆనందరావుకు చెందిన రెండు ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో ఐటీసీ, స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి విత్తనాలను విత్తారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ మాట్లాడారు. కమ్యూనిటీ ఆర్గనైజర్ శంకర్, రైతులు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామ శివారులోని కట్టమైసమ్మ ఆలయం నుంచి బచ్చువారిగూడెం వంతెన వరకు రోడ్డు అప్రోచ్ వరదలకు ఇటీవల కొట్టుకుపోగా.. రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం రెండు వైపుల మట్టితో అప్రోచ్ నిర్మాణం చేశారు. అలాగే మండలంలోని గాండ్లగూడెం-నారాయణపురం మధ్యలోని పెదవాగు వంతెన వద్ద పడిన భారీ గండిను మట్టితో పూడ్చివేశారు. కావడిగుండ్ల-కన్నాయిగూడెం మధ్యలోని వాగు వంతెన కోతకు గురైన రహదారిను మట్టితో పున:నిర్మించారు.

వీధి కుక్కల నుంచి రక్షించండి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని వివిధ కాలనీలలో గుంపులు గుంపులుగా స్వైరవిహారం చేస్తున్న వీధి కుక్కల నుంచి ప్రజలను రక్షించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ను మాజీ భద్రాచలం గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు బండారు శరత్ బాబు కోరారు. సోమవారం స్థానికులతో కలిసి ఐటీడీఏ పీవోను కలిసి వినతిపత్రం అందజేశారు.

కార్మికలోకం గళమెత్తాలి

ములకలపల్లి: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక లోకం గళమెత్తాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సంఘ ద్వితీయ మండల మహాసభలో పాల్గొన్న నటిరా ప్రసాద్, సంఘ జిల్లా అధ్యక్షుడు కంచెర్ల జమలయ్య మాట్లాడారు. తొలత సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. సంఘ జిల్లా కార్యదర్శి వి.మల్లికార్జున్, ఎండీ, యూసఫ్, నరాటి రమేశ్, ఎంపీటీసీ కొర్రి భద్రం, నకిరకంటి పుల్లారావు, మిర్యాల వెంకన్న, నారం సునీత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

దమ్మపేట: రాష్ట్ర స్థాయిలోని క్రీడా పాఠశాలకు ఎంపికైన వెంకటాద్రిగూడెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని సోయం అనితాజ్యోతికను ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి, ఎంఈఓ కీసర లక్ష్మి అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానికి చేరుకోవాలని ఆశీర్వదించారు. కాంప్లెక్స్ హెచ్ఎం సత్యసాగర్, హెచ్ఎం కృష్ణమోహన్, సోయం వీరభద్రం, సోయం రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

చంద్రుగొండ: గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు వెంటనే చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఎస్‌కె.ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. వైద్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులన్ని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కారం వెంకటేశ్వర్లు, వరికూటి వెంకట్రావ్, టీ భీముడు, రవి, మన్ను పాల్గొన్నారు.

డీఎఫ్ఓగా సుజాత

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్ అటవీ శాఖ అధికారిణిగా ఎస్. సుజాత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా డీఎఫ్ఓగా బాధ్యలు స్వీకరించిన సుజాతకు టీఎన్జీవోస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డెక్క నరసింహారావు, గగ్గురి బాలకృష్ణ, పడిజ నరసింహారావు, శ్యామల శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శిగా శ్రీరామ్మూర్తి..

అశ్వారావుపేటరూరల్: గత కొద్ది రోజులుగా ఖాళీగా ఉన్న మేజర్ పంచాయతీ కార్యదర్శి పోస్టు ఎట్టకేలకు భర్తీ అయింది. దమ్మపేట మండలం సీతారామపురం కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కోటమర్తి శ్రీరామ్మూర్తిను డిప్యూటేషన్‌పై కేటాయించారు. దీంతో ఆయన స్థానిక కార్యాలయంలో సోమవారం కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు.

సంఘం ఉపాధ్యక్షుడిగా బాలాజీనాయక్

చంద్రుగొండ: గిరిజన విద్యార్థి సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా మండలంలోని కరిశెలబోడు గ్రామానికి చెందిన మూడు బాలాజీనాయక్‌ను సంఘం జాతీయ నాయకులు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో బాలాజీనాయక్‌కు నియామకపు లేఖను అందించారు.

ఖాళీలు భర్తీ చేయాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో తగినంత డాక్టర్లు, సిబ్బంది లేని కారణంగా రోగులు ఇబ్బందులు పడుతున్నారని, ఖాళీగా ఉన్న డాక్టర్, సిబ్బంది పోస్టులు వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్‌కు సోమవారం సీపీఎం నాయకులు వినతి పత్రం అందించారు. స్పందించిన కమిషనర్ అజయ్‌కుమార్.. త్వరలోనే ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సీపీఎం నాయకులు బండారు శరత్ బాబు, ఎర్రంశెట్టి వెంకట రామారావు, ఎస్ భూపేందర్, ఎన్ నాగరాజు లు ఉన్నారు.

అమలు చేయాలి

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేయాలని సీపీఎం జిల్లా నాయకులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఎం పార్టీ మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పిట్టల అర్జున్ మాట్లాడారు. నాయకులు యంద్రాతి అప్పారావు, దొడ్డా లక్ష్మీనారాయణ, మోరంపూడి శ్రీనివాసరావు, కేశవరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజకీయ కుట్ర


చంద్రుగొండ: నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నాయకులు

చంద్రుగొండ: ఎస్సీ వర్గీకరణ రాజకీయ కుట్రలో భాగమేనని మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి మేకతోటి కాంతయ్య అన్నారు. మండల కేంద్రం చంద్రుగొండ సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రధాన సెంటర్‌లో నిరసన అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. నాయకులు బడుగు శంకర్, బేతి రాంబాబు, తలారి రాంబాబు, బడుగు కృష్ణవేణి, వెంకటేశ్వర్లు, రాయి రాజా, నాగబాబు, తంబళ్ల మంగయ్య పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు పోరాట సమితి ఆధ్వర్యంలో భద్రాచలం తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి శేఖర్ మాట్లాడారు. కాపుల సూరిబాబు, రాంబాబు, అర్జున్, జయకృష్ణ, శ్రీనివాస్, సమ్మయ్య, రమేష్, చిట్టిబాబు, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ' ఫలాలు అందేలా కృషి


మొండికుంటలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అశ్వాపురం: సీతారామ ప్రాజెక్ట్ ద్వారా అశ్వాపురం మండలంలో రైతాంగానికి సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని, సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడగా సానుకూలంగా స్పందించారని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలో సోమవారం ఎమ్మెల్యే పాయం విస్తృతంగా పర్యటించారు. కల్యాణపురం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పాయం పాల్గొన్నారు. మండల పరిధిలోని కళ్యాణపురం, పాములపల్లి, మిట్టగూడెం, అమ్మగారిపల్లి, జగ్గారం, అశ్వాపురం, మొండికుంట గ్రామ పంచాయతీలలో రూ.1 కోటి రూపాయాలతో సీసీ రోడ్లకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, అశ్వాపురం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో సైన్స్ ల్యాబ్ కొరకు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో 40 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. నెల్లిపాక గ్రామ పంచాయతీలో పలు కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా కాకతీయుల కాలం నాటి తుమ్మలచెరువుతో పాటు మండలంలోని చెరువుల ద్వారా రైతాంగానికి సాగునీరు అందించాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించానని తెలిపారు. మండలంలో మార్కెట్ గోదాం నిర్మాణానికి మొండికుంటలో స్థలం గుర్తించాలని తహసీల్దార్, గ్రామపెద్దలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ వరప్రసాద్, సీఐ అశోక్‌రెడ్డి, ఎస్సై సురేష్, పంచాయతీరాజ్ ఏఈ చక్రధరాచారి, వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, జిల్లా, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షర్ఫియుద్దీన్, ఎస్‌కె.ఖధీర్, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు కమటం నరేష్, ఎంపీటీసీలు ఏనిక రవి, గాదె జయ, గంగాభవాని, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రాంతాల వారీ రేటు తగదు

దుమ్ముగూడెం: జామాయిల్ కర్రకు రేటు విషయంలో ప్రాంతానికో రకంగా నిర్ణయించి భద్రాచలం ప్రాంత రైతులకు ఐటీసీ యాజమాన్యం అన్యాయం చేస్తోందని ఎంపీపీ రేసు లక్ష్మి విమర్శించారు. సోమవారం మండలంలోని సీతారాంపురం గ్రామంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ మండల పార్టీ, రైతు కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. అందరికీ ఒకే రేటు చెల్లించకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు అన్నే సత్యనారాయణ మూర్తి, కణితి రాముడు,నాయకులు తునికి కామేష్, దామెర్ల శ్రీనివాసరావు, పూసం రాజేష్, వందవాసు రామ వరప్రసాద్ పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నంపై విచారణ

భద్రాచలంటౌన్: భద్రాచలం గిరిజన గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఆశ్రిత గత నెల 31న ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్ సోమవారం విచారణ చేపట్టారు. కళాశాలలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితోనే కాక విద్యార్థులతో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. ఆ తర్వాత ఆశ్రిత స్వగ్రామమైన దుమ్ముగూడెం మండలంలోని మారేడుబాక వెళ్లి ఆమె తల్లి సమక్షాన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన అర్థం కాకే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తేలిన నేపథ్యాన తిరిగి కళాశాలలో చేరేలా సూచనలు చేసినట్లు ఏపీఓ తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

మణుగూరుటౌన్: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మణుగూరు ఏరియాలో టైలరింగ్, మగ్గం బ్యూటీషియన్ కోర్సులలో ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు విద్యను సద్వినియోగం చేసుకోవాలని సేవా సమితి అధ్యక్షురాలు సుమతి రామచందర్ అన్నారు. సోమవారం ఐదు బ్యాచ్‌లకు చెందిన మహిళలకు పీవీకాలనీ కమ్యూనిటిహాల్‌లో హైదరాబాద్‌కు చెందిన ఖాదీ గ్రామోద్యోగ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, సింగరేణి భవన్ ప్రతినిధి శివకుమార్, ఖాదీ గ్రామోద్యోగ్ మహావిద్యాలయ్ ప్రతినిధి నరేశ్, ఇల్లందు లేడీస్ క్లబ్ సభ్యులు ఫ్యానీ, లక్ష్మి, జాన్‌వెస్లీ, షాకీరా, సేవా కో-ఆర్డినేటర్ మారేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

ములకలపల్లి: శిథిలావస్థకు చేరిన మూకమామిడి ప్రాజెక్ట్ కాలువలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ అన్నారు. మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కాలువలకు పలుచోట్ల గండ్లుపడ్డాయని అన్నారు. అధికారులు స్పందించి, సత్వర చర్యలు చేపట్టానలని కోరారు. అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం మండల కార్యదర్శి యర్రగొర్ల రామారావు, కార్మిక సంఘం మండల కార్యదర్శి శాస్త్రబోయిన వెంకటేశ్వర్లు, ఆయకట్టు రైతులు పాయం రాజు, కొర్సా పాపారావు, కొర్సా వెంకటేశ్వర్లు, కోంద్రు నాగేష్, కీసరి గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లపల్లిలో క్షుద్ర పూజలు

గుండాల: ప్రధాన రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తులు చేసిన క్షుద్ర పూజలు చేసిన ఘటన ఆళ్లపల్లిలో సోమవారం బయటపడింది. కేజీబీవీ నూతన భవనం వద్ద పంది, కోడిని కోసి రక్తంలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, కోడిగుడ్లు, ఎర్ర జాకెట్ ముక్కతో పాటు, మట్టి కుండలు పడేశారు. ఆదివారం అమావాస్య కావడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఈ పూజలు చేసినట్లు తెలుస్తుంది. అయితే తెల్లవారు జామున అటుగా వెళ్లే స్థానికులు, వాహనదారులు చూసి భయభ్రాంతులకు గురయ్యారు. నిత్యం తిరిగే ప్రదేశాలలో ఇలాంటి పూజలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని సరోజిని వృద్ధాశ్రమంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దివంగత రిటైర్డ్ ఉపాధ్యాయురాలు టి.రత్నం సంతాప దినం సందర్భంగా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు, ఇంకనూ మాదిరెడ్డి రామ్మోహనరావు, ఎస్.రాజబాబు, కేఎస్ఎల్‌వీ ప్రసాద్, కృష్ణమూర్తి, సత్యనారాయణ, రాజబాబు, రామ్మోహనరావు, ఐలయ్య, అక్కయ్య, సుధాకర్ రెడ్డి, కిషన్‌రావు, సత్యనారాయణ, రాంబాబు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

భద్రాచలంఅర్బన్: కేరళ ప్రకృతి విపత్తు బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బాధితులను ఆదుకునేందుకు సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కల్లూరి తో పాటు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కరెడ్ల సురేష్ నాయుడు, సాధన పల్లి సతీష్, కృష్ణయ్య, మనసే, సీతారామ రాజు, అశోక్, శ్రీనివాస్, మహేష్ పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించండి

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్ ముత్యాలమ్మగుడి సమీపంలో కాల్వలకు మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించాలని కోరుతూ స్థానికులు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్షం వస్తే గతంలో వేసిన సిమెంట్ రోడ్డు వల్ల గుంతల్లో నుంచి నీరు వెళ్లక మురికినీరు రోడ్డుపైకి వస్తూ సమస్య తీవ్రంగా మారిందన్నారు. దీని వల్ల దోమలు వృద్ధి చెంది, డెంగీ వంటి జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

చర్యలు తీసుకోండి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఐటీడీఏ రోడ్డులో ఆదివారం రాత్రి జగదీష్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ గోల్ల గణేష్‌పై అకారణంగా దాడికి పాల్పడిన 10 మంది యువకులుపై చర్యలు తీసుకోవాలని సోమవారం గణేష్ భార్య గాయత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సన్మానం

ఆయా ప్రాంతాల్లోని మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పదవీకాలం పూర్తి చేసుకున్న ప్రజాప్రతినిధులకు అధికారులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలనలో ప్రజాప్రతినిధులు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారుల సహకారం ప్రశంసనీయమన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


చర్లరూరల్: ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు


ములకలపల్లి: సన్మానం అందుకున్న ప్రజాప్రతినిధులు


మణుగూరురూరల్: ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న దృశ్యం